క్లుప్తంగా

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



తిరువూరు: స్థానిక షిర్డిసాయి కల్యాణ మండపంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షుడు తీగల ఆంజనేయులు వివరించారు. దివ్యాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, స్వయం ఉపాధికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. గాంధీ డయాబెటిక్ సెంటర్ వైద్యురాలు కవిత దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంఘ నాయకులు కృష్ణ, సుబ్బాచారి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉపాలయం మల్లేశ్వర స్వామికి కార్తిక మాసం సందర్భంగా మంగళవారం అర్చకులు లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు బాల వీర మణికంఠ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేటఅర్బన్: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని పలు శైవక్షేత్రాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాలేటి తీరాన ఉన్న మతం శివాలయంలో స్వామికి ప్రీతిగా మహాన్యాస పూర్వక నారాయణ గాయత్రీ రుద్ర పాసుపత హోమం, పంచామృతాల, వివిధ పండ్ల రసాలతో అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు.

రామలింగేశ్వరునికి భస్మాభిషేకం



నందిగామ(చందర్లపాడు): మండలంలోని పొక్కునూరుని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం నేపథ్యంలో మంగళవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతం స్వామికి భస్మాభిషేకం నిర్వహించారు.

గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు అదనంగా నిర్మిస్తున్న హాల్‌కు సరస్వతి సామ్రాజ్యం సంస్థ ఫ్యాన్లు అందజేసింది. ఫ్యాన్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ గ్రంథాలయాధికారి రమాదేవికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణమ్మ మాట్లాడుతూ.. సరస్వతి సామ్రాజ్యం అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ గ్రంథాలయానికి రూ.30 వేల ఖరీదైన 16 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారన్నారు. విదేశాల్లో ఉన్న ఆయనను అడిగిన వెంటనే గ్రంథాలయంలో నిర్మిస్తున్న హాల్‌కు ఫ్యాన్లు వితరణ చేశారన్నారు. స్కైప్ ద్వారా అయ్యంకి మురళీకృష్ణ మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య మనవడిగా గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి



విజయవాడకల్చరల్: శ్రీమురుగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నా పాట తేట తెలుగు పాట పేరుతో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. సీనియర్ గాయని మురిగిపూడి కృష్ణకుమారి నాగేశ్వరరావు ఏక గళం కార్యక్రమంలో భాగంగా పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకుడు రమాశంకర్ మాట్లాడుతూ రాజీలేకుండా విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్నామని తెలిపారు. గాయని కృష్ణకుమారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతలను నిండాముంచిన మిచాంగ్



ముక్కొల్లుపాడులో పంట నష్టం వివరాలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



పోతురెడ్డిపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



వాగును తలపిస్తున్న నూజివీడు పట్టణంలోని మైలవరం రోడ్డు

- రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం, ఈదురు గాలులు
- స్తంభించిన జనజీవనం
- నేలకొరిగిన పంట పొలాలు, విద్యుత్ స్తంభాలు
- గ్రామాల్లో పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం

గంపలగూడెం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో మిచాంగ్ తుఫాన్ అన్నదాతలను నిండాముంచింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వీస్తున్న గాలులు, కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. గ్రామాల్లో మొక్కజొన్న, వరితో పాటు పలు పంట పొలాలు నేలకొరిగాయి. భారీ గాలులతో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నారు. గంపలగూడెం మండలంలో గడిచిన 36 గంటల్లో 38.4 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. గంపలగూడెం మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,208 హెక్టార్లలో వరిసాగు చేశారు. సాగుపైరులో 20శాతం కోతలు పూర్తికాగా ప్రస్తుతం కోత, గింజపాలు పోసుకొనే దశలో ఉంది. ఈతరుణంలో వచ్చిన తుఫాను వరిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో కోతకు వచ్చిన వరి ఈవర్షంతో నేలవాలింది. పంటను రక్షించుకోనే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ వర్షం మిరప పంటకు కొంతమేర లాభాన్ని ఇస్తోందని ఏవో సాయిశ్రీ తెలిపారు. మరింత వర్షం కురిస్తే పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట నష్టం పరిశీలన

తిరువూరు: తుఫాన్ ప్రభావంతో మండలంలో వరిచేలు నీట మునిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట ఈదురు గాలులకు నేలవాలి, వర్షపు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. అవసరమైతే ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి పద్మ గ్రామాల్లో జరిగిన పంటనష్టాన్ని పరిశీలించారు. వర్షాలు తగ్గే వరకు వరి కోతలు నిలిపి వేయాలని, నీట మునిగిన వరి పంట సస్యరక్షణకు చర్యలు సూచించారు.

పంట నష్టంపై అంచనాలు

మైలవరం: నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాల్లోని పలు గ్రామాల్లో వరి, పత్తి, మిరప, మినుము తదితర పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందస్తుగా తీసుకున్న నిర్ణయంతో రైతులకు ఇబ్బంది కలుగకుండా అన్ని జిల్లాల కలెక్టర్లకు అదేశాలిస్తూ నిధులు కూడా మంజూరు చేయడంతో రైతులు ఊరట చెందుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు రంగంలోకి దిగి పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారు. నియోజకవర్గంలోని మైలవరం మండలంలో వరి 6010 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా మంగళవారం అంచనా ప్రకారం 90 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అలాగే మిరప 500 ఎకరాలు, పత్తి 2,900 ఎకరాలు రైతులు సాగు చేస్తుండగా జి.కొండూరు మండలంలో వరి 7,980 ఎకరాలు, మిరప 1,068 ఎకరాలు, పత్తి 5,604 ఎకరాలు, మినుము 300 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. మైలవరం మండలంలో 205 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలంలో 550 ఎకరాల్లో పంట దెబ్బ తిన్నట్లు అధికారులు తెలిపారు. పంట దెబ్బతిన్న పొలాలను వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు.

జనజీవనం అతలాకుతలం

ముసునూరు: తుపాన్ కారణంగా ఎడతెరపి లేకుండా కురిసిన కుండపోత వర్షం మండలాన్ని అతలాకుతలం చేసింది. వర్షం ధాటికి వాగులు, వంకలు పొంగిపోర్లాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. మండలంలో సగభాగం పైగా వ్యాపించి ఉన్న సంధ్యపు వాగు, పలుచోట్ల ఉధృతంగా ప్రవహిస్తూ ఉంది. దీంతో వలసపల్లి–ముసునూరు గ్రామాల మధ్య రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చెక్కపల్లి, వలసపల్లి, రమణక్కపేట గ్రామాల్లో పలు నివాసాల్లోకి, పంట పొలాల్లోకి వర్షపు నీరు బాగా చేరింది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తి నష్టం, జన నష్టం వాటిల్లలేదని తహసీల్దార్ దాసరి సుధ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

చంద్రాల(మైలవరం): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు మైలవరం మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి, వైర్లు తెగిపోయాయి.

మంగళవారం సాయంత్రం తీవ్రంగా గాలులు వీస్తూ భారీ వర్షం కురిసింది. మండలంలోని చంద్రాల గ్రామంలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై సిబ్బందిని వెంటనే రంగంలోకి దింపి విద్యుత్ లైన్‌లను సరిచేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విద్యుత్‌ను పునరుద్ధరింపజేశారు.



చంద్రాలలో నేలకొరిగిన స్తంభం సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

రైతాంగంపై 'మిచాంగ్' దాడి

నూజివీడు: అన్నదాతలపై మిచాంగ్ తుఫాన్ విరుచుకుపడింది. నియోజకవర్గంలోని నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండలాల్లో వరి, మిర్చి, పత్తి, మినుము మొక్కజొన్న, నాటుపొగాకు పంటలు తుపాను తాకిడికి దెబ్బతిన్నాయి. సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురవ్వడంతో పాటు వరి పంట పలు గ్రామాల్లో నేలవాలింది. దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. రెండు రోజులు గడిస్తే గాని ఖచ్చితంగా ఎంత నష్టం వాటిల్లందనే అంచనా వేయలేమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

సబ్‌కలెక్టర్ రాజేంద్రన్ పర్యటన

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మండలంలోని ముక్కొల్లుపాడులో పంటలను పరిశీలించారు. ఏడీఏ జి.విద్యాసాగర్, ఏవో ఆలూరు చాముండేశ్వరి పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు తదితర గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంట ముంపునకు గురైంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలందరూ ఇళ్లకే పరిమితవ్వగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు మాత్రం విధులకు హాజరయ్యారు. దుకాణాలు నామమాత్రంగా మాత్రమే తెరుచుకున్నాయి. పాఠశాలలకు ప్రభుత్వమే సెలవు ప్రకటించగా, ప్రైవేటు కళాశాలలు సైతం తెరుచుకోలేదు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులోకి వరదనీరు భారీగా ప్రవేశించింది. భారీ వర్షానికి రహదారులన్నీ వరదమయమై వాగులను తలపించాయి.

దెబ్బతిన్న పంటలు

ఆగిరిపల్లి: మండలంలో సుమారుగా 100 ఎకరాలు వరి పంటకు నష్టం వాటిల్లింది. మినుము 30 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఈదురు గాలులు ప్రభావంతో కోతకు వచ్చిన వరి పంట పలుచోట్ల నేలకొరిగింది. కోత పూర్తయిన పొలాల్లో వరి పనలు వర్షం కారణంగా తడిసి ముద్దయ్యాయి.



తిరువూరులో నీట మునిగిన వరి పొలాలు



గంపలగూడెం మండలంలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న అధికారులు



మునగపాడులో నేలకొరిగిన వరి చేను



ఆగిరిపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలు

రైతన్నలు ఆందోళన చెందవద్దు

చాట్రాయి: మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ఎలాంటి ధాన్యాన్ని అయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం, చాట్రాయి, జనార్దనవరం గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. తుఫాన్‌తో రైతులు అప్రమతంగా ఉండాలని సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా చుట్టూ నీరు నిల్వకుండా పట్టాలతో కప్పుకోవాలని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కల్లాల్లో ఉంచకుండా ఆర్బీకేల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. తడిసిన ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడంతో మొలకెత్తదని చెప్పారు. తుఫాన్ వలన అత్యవసరంగా సోమవారం 140 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు లారీల ద్వారా తరలించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



చాట్రాయిలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మైలవరం: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన అన్నదాతలను వైఎస్సార్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రతలు పాటించాలని సూచిస్తూ, ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. వాగులు, వంకలు దాటే సమయంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, మూగజీవాలు రక్షణకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. గ్రామ స్థాయిలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకుని ప్రజలకు విస్తృత సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం నివారణకు రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేయాలని, వైఎస్సార్ సీపీ శ్రేణులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలింపు

గంపలగూడెం: తుఫాన్ కారణంగా కురిస్తున్న భారీ వర్షాలతో వరిపైరు దెబ్బతిన్న నేపథ్యంలో రైతులను ఆదుకొనే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ధాన్యం కొనుగొలులో నిబంధనలు సడలించినట్లు మండల వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గతంలో తేమ శాతం 16 ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగొలు చేశారన్నారు. ప్రస్తుతం తేమ శాతాన్ని, ఇతర నిబంధనలను పరిగణలోకి తీసుకోకుండా రైతుల నుంచి ధాన్య కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని చెప్పారు. మూడు రోజుల పాటు ఈ సడలింపు ఉంటుందని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో పురోగతి

ముసునూరు: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, రైతులు వినియోగించుకోవాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ పిలుపునిచ్చారు. చెక్కపల్లి గ్రామంలోని పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, కల్లాల్లోనూ, పనలపై ఉన్న వరి పంటను మంగళవారం తహసీల్దార్ దాసరి సుధతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ధాన్యం కొనుగోలులో వేగవంతం చేశామని, ప్రతి కేంద్రం నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించామని చెప్పారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ముసునూరు: రైతులు పండించిన ధాన్యాన్ని వర్షం బారిన పడకుండా కాపాడుకోవాలని వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ సూచించారు. మండలంలో తుపాను బారిన పడిన పలు పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులు తమ పొలాల్లోకి చేరిన నీటిని తొలగించేందుకు, కల్లాల్లోని ధాన్యాన్ని సత్వరమే కాపాడుకునేందుకు ఉపాధి హామీ విభాగాన్ని సంప్రదించి, వారి సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రోజీలీల, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చెక్కపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దార్ సుధ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1.వర్షాలకు పడిపోయిన లేదా నీట మునిగిన వరి కంకులపై 100 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పును కరిగించి, ఆ ద్రావణాన్ని చల్లడం ద్వారా గింజలు మొలకెత్తడం, రంగు మారడం, బూజు పట్టడం నివారించవచ్చు.

2.అత్యవసర పరిస్థితిలో పనలు ఆరకుండానే కుప్ప వేయవలసి వస్తే, వరుసలపై ఐదు శాతం ఉప్పు నీటిని పిచికారీ చేయడం లేదా చేతితో సమానంగా చల్లడం వంటివి చేస్తే 10–15 రోజుల వరకు గింజలు మొలకెత్తకుండా కాపాడుకోవచ్చు.

3.కుప్ప నూర్పిడి సమయంలో వర్షాలకు కల్లాల్లోనే ధాన్యం తడిసితే ఉప్పు, ఊకను కలిపి ధాన్యాన్ని రాశిగా పోస్తే, ధాన్యం పాడవకుండా నిల్వ చేసుకోవచ్చు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం

నూజివీడు: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని సచివాలయాల పట్టణ కన్వీనర్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సచివాలయం పరిధిలోని 23, 24 వార్డుల పరిధిలో నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిల్లా చరణ్ మాట్లాడుతూ రెండు వార్డుల పరిధిలోని ప్రజలకు రూ.20.88 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు ప్రజలందరూ అండగా నిలబడి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు గబ్బర్, రామగిరి రంగబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బుడమేరులో నీటి పారుదలకు చర్యలు

జక్కంపూడి(విజయవాడరూరల్): మిచాంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బుడమేరులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బుడమేరులో వరద ఉధృతి మరింత పెరిగితే రాయనపాడు, జక్కంపూడి, గొల్లపూడి, ఈలప్రోలు గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులు బుడమేరులో అడ్డుకట్టలను తొలగించే పనులు చేపట్టారు. జక్కంపూడి–గొల్లపూడి గ్రామాల మధ్య బుడమేరు కాల్వపై రైల్వే ట్రాక్ నిర్మాణం నిమిత్తం బాక్స్‌ను నిర్మించారు. అందుకుగాను మూడు తూముల్లో రెండు తూములు మూసి ఉండడంతో పై నుంచే వచ్చే బుడమేరు ఉధృతికి నష్టం జరగకుండా ఉండేందుకు రెండు తూముల నుంచి కూడా బుడమేరు వరద పారుదల అయ్యే విధంగా ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ పనులు చేయిస్తున్నారు. జక్కంపూడి నుంచి వరద నీరు ఎనికేపాడు గ్రామంలోని అండర్‌టన్నెల్ వరకు వెళ్తుందని ఏఈ తెలిపారు. గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకు ఒరిగింది.



జక్కంపూడి వద్ద పనులు చేపడుతున్న సిబ్బంది

17 నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లోని స్వయం భూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో ఈ నెల 17 నుంచి 19 వరకు సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బోయిన వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 18న ఉదయం శతభిషా నక్షత్ర యుక్తమకర లగ్నంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, శ్రీదేవసేనాదేవి, శ్రీవల్లీదేవిల కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. 19న ఉదయం హోమం, పుష్పార్చన రాత్రి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.